## క్లుప్తంగా

### కేఎల్‌యూకు ఐఎస్‌ఓ గుర్తింపు

– వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఐఎస్ఓ సర్టిఫికేట్ పొందినట్లు వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ తెలిపారు. శుక్రవారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుస్థిరత, సమర్థవంతమైన వనరుల నిర్వహణపై నిబద్ధత దృష్ట్యా ఐఎస్ఓ 14001:2015 మరియు ఐఎస్ఓ 50001:2018 గుర్తింపు పొందిందని తెలిపారు. ఇది తమ వర్సిటీకి ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణిస్తున్నామన్నారు. వర్సిటీ ప్రొ.వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### వలంటీర్లు రాజీనామా



మంగళగిరి: నియోజకవర్గంలో వలంటీర్లు రాజీనామాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం పెదవడ్లపూడి గ్రామానికి చెందిన వలంటీర్లు తమ రాజీనామాలను కార్పొరేషన్ అధికారులకు అందజేశారు.

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు వలంటీర్లు శుక్రవారం తమ రాజీనామా లేఖలను సచివాలయ సెక్రటరీకి అందజేశారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసేందుకు కృషి చేస్తామని వారు అన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడికొండ: మరమ్మతుల దృష్ట్యా తాడికొండ మండలంలో విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలగనుందని ఏఈఈ రవికుమార్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 11వరకు విద్యుత్ కోత ఉంటుందని, మోతడక, నిడుముక్కల గ్రామాలలో నూతన లైన్లు వేస్తున్నందున సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

### కృష్ణానదిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణానది దిగువ ప్రాంతంలో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు కనుగొన్నారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ రమేష్ సంఘటనా స్థలానికి వెళ్లి నీటిలో వున్న మృతదేహాన్ని వెలికి తీశారు. ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ ఎవరో గుర్తుతెలియని మహిళ కనకదుర్గ వారధిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటుందని భావిస్తున్నామని, మృతురాలి వద్ద నుంచి ఎటువంటి వివరాలు లభించలేదని, మృతురాలి దేహంపై లైట్ బ్లూకలర్ చీర, పైన గోల్డ్ కలర్ అడ్డగీతలు, ఎర్రపూలు ఉన్నాయని, ఒంటిపై రోల్డ్ గోల్డ్ చైన్, గాజులు, కమ్మెలు ధరించి ఉందన్నారు.

### దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీ



తెనాలి అర్బన్ : దోమల నియంత్రణపై ప్రజలకు అవగాహన పెంచుకోవాలని తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మలేరియా విభాగం ఆధ్వర్యంలో బుర్రిపాలెం రోడ్డులోని హడ్కో కాలనీలో దోమల నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఇంటి పరిసరాల్లో ఉన్న పాత వస్తువుల్లోని నీటిని తొలగించాలని సూచించారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని చెప్పారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో ఉన్న నీరు దోమలకు ఆవాసాలని తెలిపారు. దోమకాటు వల్ల విషజ్వరాలు, డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తి గత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లీశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

తెనాలి రూరల్ : నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్‌బ్యూరో అధికారులు కేసు నమోదు చేశారు. తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం తెనాలి మండలం కొలకలూరు వద్ద తనిఖీలు నిర్వహించారు. ఓ వ్యక్తి వద్ద 13 క్వార్టరు మద్యం సీసాలు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు.



సీఎం వైఎస్ జగన్‌తో సెల్ఫీ దిగుతున్న యువతి



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి స్వాగతం పలికేందుకు బొకేతో ఎదురు చూస్తున్న గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య, ప్రత్తిపాడు ఎమ్మెల్యే సుచరిత



సీఎం వైఎస్ జగన్ కాన్వాయ్ ముందు సందడి చేస్తున్న యువత

– పట్నంబజార్, లక్ష్మీపురం

# ‘మేమంతా సిద్ధం’కు మేము సైతం

**మంగళగిరి నియోజకవర్గం నుంచి భారీగా తరలివెళ్లిన పార్టీ శ్రేణులు**

మంగళగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు జిల్లా ఏటుకూరులో ఏర్పాటు చేసిన మేమంతా సిద్ధం బహిరంగసభకు మంగళగిరి నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు అభిమానులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. నగరంలో వలు గ్రామాల నుంచి నాయకులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాలలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి సభకు తరలివెళ్లారు. పలుచోట్ల నాయకులు, పార్టీ జెండాలు ఊపి వాహనాలను ప్రారంభించారు. ఎన్నికలలో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవడంతో పాటు బీసీ మహిళ అయిన లావణ్యను గెలిపించుకుంటామని తెలిపారు. బస్సు యాత్ర శనివారం మంగళగిరి నియోజకవర్గంలో అడుగుపెట్టనున్న నేపథ్యంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు.

- ఏటుకూరు తరలిన శ్రేణులు..

తాడేపల్లిరూరల్: ఏటుకూరులో శుక్రవారం జరిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బహిరంగ సభకు తాడేపల్లి పట్టణ, రూరల్, దుగ్గిరాల మండలాల నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి వలు ప్రాంతాల్లో సిద్ధం బస్సుయాత్రకు వెళుతున్న నాయకుల, కార్యకర్తల బస్సులను ప్రారంభించారు. మహానాడులో దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, నులకపేటలో జేసీఎస్ గుంటూరు జిల్లా కో–ఆర్డినేటర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, మాజీ కౌన్సిలర్ ఎండీ గోరే, మహానాడు కరకట్ట వెంబడి వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ నాయకులు చినబోతుల దుర్గారావు, మేడా వెంకటేశ్వరరావు (పండు) బస్సులను ప్రారంభించారు. సీతానగరం, సలామ్ హోటల్ సెంటర్, మహానాడు, సీఎస్ఆర్ కల్యాణ మండపం, కేఎల్ రావు కాలనీ, డోలాస్‌నగర్, ప్రకాష్‌నగర్, 1వ వార్డు బోసు బొమ్మసెంటర్, గణేష్ కళామందిర్, పోలీస్ స్టేషన్ తదితర ప్రాంతాల నుంచి బస్సులు ప్రారంభమయ్యాయి. బాలసాని అనీల్, బత్తుల దాము, ముదిగొండ ప్రకాష్, ఎలీషా, మాజీ కౌన్సిలర్ లక్ష్మీ రోజ, అప్పికట్ల సంపూర్ణ పార్వతి, భూపతి కిషోర్ నాయుడు, దుర్గగుడి మెంబర్ జక్కిరెడ్డి ప్రభాకర్ రెడ్డి (జేపీ), మధు, రామిరెడ్డి, మాజీ కౌన్సిలర్ దర్శి విజయశ్రీ., గేలయ్య, శ్రీనివాసరావు, సుబ్బు, ఉంద్రు కళ్యాణ్, సాంబిరెడ్డి, మేకా అంజిరెడ్డిలు పాల్గొని బస్సులను ప్రారంభించారు.



ఇప్పటంలో బస్సును ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



మేమంతా సిద్ధం సభకు తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు



ముగ్గురోడ్డులో బస్సును ప్రారంభిస్తున్న ఎస్సీ సెల్ నాయకుడు ముదిగొండ ప్రకాష్

- తాడేపల్లి రూరల్‌లో....

తాడేపల్లి రూరల్‌లోని వైఎస్సార్ సీపీ పెనుమాక అధ్యక్షుడు మేకా రామేష్‌రెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ నాయకులు బొక్క నాని, భుజంగరావు, బషీర్ తదితరుల ఆధ్వర్యంలో బస్సులను ప్రారంభించారు. ఉండవల్లి ఎస్సీ కాలనీలో జేసీఎస్ మండల కన్వీనర్ అనిల్, శ్రావణ్, బాలాజీ రెడ్డి, సాంబిరెడ్డి, తోక సత్యనారాయణలు బస్సులను ప్రారంభించారు. కుంచనపల్లి, ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు, వడ్డేశ్వరం, కొలనుకొండ, ఇప్పటంల నుంచి బస్సులు ప్రారంభమయ్యాయి. పార్టీ మండల అధ్యక్షుడు అమరా నాగయ్య, మిరియాల రాంబాబు, తాడేపల్లి రూరల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మరియబాబు, రైతు సంఘం నాయకులు నాగిరెడ్డి, నామతోటి కోటేశ్వరరావు, మండల మాజీ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి, మేకల సాంబశివరావు, బాజీ గంగాధర్, బీసీ సెల్ నాయకులు కత్తిక రాఘవరావు, మల్లికార్జునరావు (బుల్లబ్బాయి), గొడవర్తి శ్రీనివాసరావు, సూతక్కి శ్రీను, గొర్రిపాటి వెంకటేశ్వరరావు, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, హరిబాబు గౌడ్, లబ్బి తులసీదాస్ తదితరులు బస్సులను ప్రారంభించారు.

- దుగ్గిరాల....

దుగ్గిరాల మండల పరిధిలో వలు ప్రాంతాల్లో ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజీ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు శృంగారపాటి రత్నం, వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు వడ్డేశ్వరపు రజనీకాంత్, మేకతోటి వీరయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా సంఘాల నాయకులు బస్సులను ప్రారంభించారు.



లాం గ్రామం నుంచి సిద్ధం సభకు బయలు దేరుతున్న నాయకులు, కార్యకర్తలు

### తాడికొండ నుంచి భారీగా తరలిన శ్రేణులు

తాడికొండ: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గుంటూరు జిల్లా పర్యటనలో భాగంగా ఏటుకూరులో నిర్వహించిన బహిరంగ సభ, మేడికొండూరు మండలంలో బస్సుయాత్రకు తాడికొండ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న బస్సుల్లో మహిళలు, నాయకులు, కార్యకర్తలు తాడికొండ, తుళ్ళూరు, మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల నుంచి తరలి వెళ్లి జగనన్నకు సాదర స్వాగతం పలికారు.



తాడికొండ బీసీ కాలనీ నుంచి బస్సును ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి

# అడుగడుగునా బ్రహ్మరథం

- కొర్రపాడు అడ్డరోడ్డు వద్ద సీఎం వైఎస్ జగన్‌కు గజమాలలతో స్వాగతం పలికి, గొర్రెపిల్ల, పవిత్ర ఖురాన్‌ను అందజేసిన నాయకులు
- మేడికొండూరు వద్ద వర్షపు హోరులోనూ తగ్గని జనం

తాడికొండ: తాడికొండ నియోజకవర్గం మేడికొండూరు మండలం కొర్రపాడు వద్దకు సీఎం వైఎస్ జగన్ కాన్వాయ్ మధ్యాహ్నం 1 గంటకు చేరుకుంది. పల్నాడు జిల్లా నుంచి గుంటూరు జిల్లాలోకి సీఎం జగన్ కాన్వాయ్ చేరడంతో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యలు బస్సులోకి ఎక్కి నియోజకవర్గ నాయకులను పరిచయం చేశారు. మండల జడ్పీటీసీ కందుల సిద్ధయ్య గొర్రెపిల్లను బహూకరించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వగా, మండల జేసీఎస్ కన్వీనర్, మైనార్టీ నాయకుడు షేక్ నాసర్ వలి (అబ్బాస్) సీఎంకు పవిత్ర ఖురాన్‌ను అందజేశారు. తన్ను చూసేందుకు వచ్చిన ఓ వృద్ధురాలిని సీఎం వైఎస్ జగన్ బస్సుపైకి పిలిచి ఆప్యాయంగా పలకరించి సంక్షేమ పథకాలు, పింఛన్ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సీఎం ప్రచార వాహనం బస్సులోకి తాడికొండ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వర రెడ్డి, ఫిరంగిపురం జడ్పీటీసీ దాసరి కత్తిరేణమ్మ, మేడికొండూరు ఎంపీపీ మన్నవ స్వప్న, రాజేష్, మేడికొండూరు మండల అధ్యక్షుడు తాళ్ళూరు వంశీకృష్ణలు ఎక్కారు. అనంతరం కొర్రపాడు ఎస్సీ కాలనీ వద్ద స్థానిక మహిళల అభ్యర్థన మేరకు బస్సును నిలిపి ఆప్యాయంగా పలకరించారు. అనంతరం పాలడుగు అడ్డరోడ్డు మీదుగా, జంగంగుంట్ల పాలెంకు చేరుకోగా మహిళలు పెద్ద ఎత్తున చేరుకొని సర్పంచ్ కల్లి శ్రీదేవి సాంబిరెడ్డి దంపతులతో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు జగనన్నకు గజమాలలతో స్వాగతం పలికారు. గ్రామానికి చెందిన వలంటీర్లు జగనన్నా సుపరిపాలన నిమిత్తం మేము వలంటీర్ పదవులకు రాజీనామా చేశామని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని బ్యానర్ ప్రదర్శించారు. అనంతరం సిరిపురం అడ్డరోడ్డు వద్దకు కాన్వాయ్ చేరుకోగా భీమినేనివారిపాలెం, సిరిపురం గ్రామాలకు చెందిన కార్యకర్తలు భారీగా తరలివచ్చి స్వాగతం పలికారు. భీమినేని వారిపాలెం అడ్డరోడ్డు వద్ద చిరుజల్లులు ప్రారంభమై భారీ వర్షం కురవడంతో వర్షాన్ని సైతం లెక్క చేయకుండా మహిళలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బారులుతీరారు. మేడికొండూరులో మహిళలు, మైనార్టీలు, ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన పలువురు కార్యకర్తలు వర్షంలోనే బారులు తీరి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికారు. విశదల గ్రామ అడ్డరోడ్డు వద్ద అభిమానులు, కార్యకర్తలు భారీగా చేరి గజమాలతో జగనన్నకు స్వాగతం పలికారు. మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొని పేరేచర్ల జంక్షన్‌లో భవనాలపై ఎక్కి అభివాదం చేస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు.

### వర్షంలోనూ చెదరని అభిమానం



వర్షాన్ని సైతం లెక్క చేయకుండా మేడికొండూరు రోడ్డుపై నిలిచిన అభిమానులు

మేడికొండూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్ర శుక్రవారం మధ్యాహ్నం మేడికొండూరు మండలానికి చేరుకొంది. గ్రామానికి వచ్చిన తమ అభిమాన నేతకు క్రేన్‌ల సహాయంతో నాయకులు గజమాలలు వేసి, పూల వర్షం కురిపించారు. ఉన్నట్టుండి ఒక్కసారిగా అకాల వర్షం పడినప్పటికీ చెక్కు చెదరని అభిమానంతో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మహిళలు పెద్ద ఎత్తున వానకు తడుస్తు బారుల తీరారు.

- సీఎం కాన్వాయ్ రోడ్డు మార్గంగుండా ముందుకు సాగుతుండగా, ఒక నడవలేని మహిళను చూసి కాన్వాయ్‌ను ఆపి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు దిగి కిందకి వచ్చి మాట్లాడారు.

### విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలి

కొల్లిపర : విద్యార్థులకు ప్రతి ఉపాధ్యాయుడు ఉత్తమ బోధన అందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని, అలాంటి ఉపాధ్యాయులకు సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎంఈవో1 సాల్మాన్‌రాజు, ఎంఈవో2 ఝాన్సీలత అన్నారు. గతంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన పి.మృత్యుంజయరావు, షేక్ నూర్జహాన్‌ను శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రంలో తోటి ఉపాధ్యాయులు సత్కార సభ నిర్వహించారు. ఎంఈవోలు పాల్గొన్ని వారిని సత్కరించారు.

# జననేతకు ఘనస్వాగతం పలికేందుకు సిద్ధం

- నేడు మంగళగిరి నియోజకవర్గంలో సీఎం జగన్ మేమంతా సిద్ధం బస్సు యాత్ర
- కాజ టోల్‌గేట్ వద్ద సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమైన పార్టీ శ్రేణులు
- నాయకులతో సమావేశంలో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు



నాయకులతో సమావేశమై ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ హనుమంతరావు

మంగళగిరి: మేమంతా సిద్ధం అంటూ ఎన్నికల ప్రచారంలో మంగళగిరి నియోజకవర్గానికి విచ్చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘనస్వాగతం పలికేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధమయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు దిశానిర్దేశం చేశారు. కాజ టోల్‌గేట్ వద్ద శనివారం ఉదయం మేమంతా సిద్ధం యాత్ర నియోజకవర్గంలో అడుగుపెట్టనున్న నేపథ్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వేలాదిగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై స్వాగతం పలికేందుకు సిద్ధం కావాలన్నారు. అనంతరం ఆత్మకూరు జాతీయ రహదారి వెంటనున్న సీకే కన్వెన్షన్‌లో చేనేత ప్రముఖులు, కార్మికుల ఆత్మీయ సమావేశంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. సమ సమాజనిర్మాణం కోసం డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, పూలే వంటి మహానుభావుల ఆశయాలు నెరవేర్చేందుకు బడుగు, బలహీనవర్గాలను అధికారంలో భాగస్వాములును చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాలవారికి రాజకీయంగా, అన్నిరంగాల్లో అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. అందులో భాగంగానే మంగళగిరి నియోజకవర్గాన్ని బీసీలకు కేటాయించారన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ఘనస్వాగతం పలికేందుకు బీసీలంతా తరలిరావాలని కోరారు. జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, దుగ్గిరాల జెడ్పీటీసీ మేకతోటి అరుణ, ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల పట్టణ, రూరల్ కన్వీనర్లు ఆకురాతి రాజేష్, మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బుర్రముక్క వేణుగోపాల్‌రెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి, దానబోయిన వెంకటేశ్వరరావు(డివిఆర్), దాసరి వీరయ్య, శృంగారపాటి రత్నం, జేసీఎస్ కన్వీనర్లు ఈదులమూడి డేవిడ్‌రాజు, ఎండీ ఫిరోజ్, అన్నపురెడ్డి బ్రహ్మానందరెడ్డి, సంకె సునీత, మల్లవరపు సుధారాణి, మురుగుడు సత్యం, ఊట్ల కల్యాణ్, మునగాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

**రాష్ట్రబాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు పద్మావతి**

కొల్లిపర : అంగన్ వాడీ కేంద్రాల్లో గర్భిణీలకు, బాలింతలకు ప్రభుత్వం ప్రతి నెలా అందిస్తున్న ఆకుకూరలు, పౌష్టికాహారం, ఐరన్ మాత్రలు క్రమం తప్ప కుండా తీసుకోవాలని రాష్ట్రబాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. మండల కేంద్రం కొల్లిపరలో హైస్కూల్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం స్థానిక ఎంఈవో1, 2 సాల్మన్‌రాజు, ఝాన్సీలత తో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణీలకు, బాలింతలకు, చిన్నారులకు ప్రభుత్వం ప్రతి నెలా అందిస్తున్న పౌష్టికాహారం ఇస్తున్నారా లేదా అని గ్రామంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు, చిన్నారులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యంలో ఫోర్టిఫైడ్ రైస్ ను వినియోగిస్తున్నారని, వాటి వల్ల గర్భిణీలలో, చిన్నారుల్లో రక్తహీనత నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ నాగమణి, సీఆర్‌పీ పిడపర్తి రమేష్‌బాబు, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సభ్యురాలు పద్మావతి

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

తెనాలిరూరల్: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగ పర్చుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, 6వ అదనపు జిల్లా న్యాయమూర్తి కేపీ బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. మే 11వ తేదీన జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అవడం ద్వారా కక్షిదారులకు ఆర్థిక పరంగానూ వెసులుబాటు కలుగుతుందని, కోర్టుల్లో ఉన్న కేసులనూ రాజీ చేసుకోవచ్చని తెలిపారు. కేసుల లిటిగేషన్ విపరీతంగా పెరగడం వల్ల వాటిని పరిష్కరించే దిశగా లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సివిల్ కేసులు ఏ దశలో ఉన్నా పరిష్కరించుకోవచ్చని సూచించారు.

### భక్తిరస రాముని కీర్తనలకు హృద్యమైన నృత్యం



నృత్యాంశ ప్రదర్శనలో చిన్నారులు

తెనాలి : పట్టణ నాజరుపేట కొల్లూరు వారి వీధిలో గల శ్రీసీతా రామాంజనేయస్వామి దేవస్థానంలో శ్రీక్రోధి నామ సంవత్సరం ఆరంభమైన ఈనెల 9వ తేదీనుంచి 40వ వసంత నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుపుతున్నారు. శ్రీస్వామి వారికి నిత్యార్చనలతోపాటు గ్రామ కచేరీలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, కోలాటాలు, పాటలు, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు.గురువారం రాత్రి కళ్యాణి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీచే కూచిపూడి నృత్య ప్రదర్శనలు జరిగాయి. అకాడమీ అధినేత, ప్రముఖ నృత్యగురువు డాక్టర్ చల్లా బాలత్రిపుర సుందరి శిష్యబృందమైన 38 మంది చిన్నారులు వివిధ నృత్యాంశాలను ప్రదర్శించారు. అవన్నీ భక్తి రస రాముని కీర్తనలే కావటం విశేషం. చిన్నారుల నృత్యాభినయాన్ని భక్తులు, ఆలయ కమిటీ బాధ్యులు అభినందించారు.

# పేదలకు కాళీకామాత ఆలయ కమిటీ అన్నదానం



తెనాలి అర్బన్ : శ్రీ కాళీకామాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివాజీ చౌక్‌లోని దేవస్థానం వద్ద శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ గుమ్మడి రమేష్ మాట్లాడుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాలుగు సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి వై.శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు మేక సురేష్, కందేపి సీతారామయ్య, నిరంజన్, సుబ్బారావు, అడపాల శ్రీనివాసరావు, పి.రామకృష్ణ, సిహెచ్.హనుమంత్, పి.వెంకట్రావు, సుంకర రాజాబాబు, నక్కా వెంకటేశ్వర్లు, దాకా అంకిరెడ్డి పాల్గొన్నారు.